క్లుప్తంగా

నీలమణిదుర్గ అమ్మవారికి మంత్రి సీదిరి పూజలు



మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ చైర్మన్

పాతపట్నం: పాతపట్నం ఆరాధ్యదైవం నీలమణిదుర్గ అమ్మవారిని రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు, సభ్యులు అమ్మవారి ఆలయంలోకి పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఆహ్వానించి అమ్మవారి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న కరుణాకరరావు

పాతపట్నం: మండలంలో జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సరైన పరిష్కారం వచ్చేలా మండల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో బుధవాకరం సమావేశం నిర్వహించారు. 1920కి లబ్ధిదారులు ఫోన్ చేసి సమస్యలు చెబితే ఆయా శాఖల అధికారులు స్పందించాలన్నారు. లబ్ధిదారులు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఏపీఓ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కరపత్రాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం సచివాలయంలో బ్రెడ్స్, ఏపీపీఐ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి జీవీ రమణ మాట్లాడుతూ మండలంలో తాము 16 గిరిజన గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కాళ్ల సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు శోభనాపురం మురళి, రంజిత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొట్టవలసలో పారిశుద్ధ్య పనులు



మురుగును తొలగిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: ప్రత్యేక శానిటేషన్ దినోత్సవం సందర్భంగా బుధవారం రొట్టవలస పంచాయతీలో పారిశుద్ధ్యపనులు చేసారు.ముందుగా మురుగుకాల్వల్లో ఉన్న పూడిక తొలగించారు. బోరుబావులు వద్ద ఈగలు, దోమలు చేరకుండా క్లోరినేషన్ చేసారు. సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, నాయకులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

బూర్జ: మండలంలోని పెద్దపేట అర్ష్ స్వచ్ఛంద సంస్థలో చేపల పెంపకంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్.బాలకృష్ణ తెలియజేశారు. 15 మంది గిరిజన యువకులకు చేప పిల్లల ఎంపిక, వాటిని రవాణా చేసేటప్పుడు, చెరువులో విడిచి పెట్టినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. చేప పిల్లల పెరుగుదల గూర్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మేత, యాజమాన్య పద్ధతులు వివరించామన్నారు. చేపపిల్లల పెంపకంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

స్నేహపూర్వక బోధనతో నాణ్యమైన విద్య

కొత్తూరు: ఉపాధ్యాయులు స్నేహపూర్వకమైన బోధన చేసినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.హేమలతాకుమారి అన్నారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులతో బుధవారం మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ గొర్లె శంకరనారాయణ బోధనలో మెలకువలను వివరించారు.

కుండపోత..

- నరసన్నపేటలో వీధులన్నీ జలమయం
- లోతట్టు పొలాల్లో చేరిన వర్షం నీరు



ఎల్.ఎన్.పేట: దబ్బపాడు వద్ద నీట మునిగిన పంట పొలాలు

నరసన్నపేట: మండలంలో బుధవారం సాయంత్రం 5.30 నుంచి 8:30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. నరసన్నపేట పట్టణంలోని వీధులన్నీ జలమయమయ్యాయి. బజారు వీధి, నాయుడు వీధి, కలివరపుపేట, జోగిపేట, శివనగర్ కాలనీ, మారుతీ నగర్, జయలక్ష్మి నగర్, బొంతలవీధి, వీరన్నాయుడు, బస్టాండ్, పాత బస్టాండ్, శ్రీరామనగర్, గాంధీనగర్ తదితర వీధుల్లో వర్షం నీరు అధికంగా చేరింది. మండలంలో గడిచిన నాలుగు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. నరసన్నపేటతోపాటు ఇతర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో నిండాయి. పొలాల్లో నీరు అధికంగా చేరింది. బుధవారం ఉదయం సాయంత్రం నాలుగు గంటల వరకు 3.06 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

పెరిగిన వరదనీరు..

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య తురకపేట వద్ద ఉన్న కడపలవాని గెడ్డకు వరదనీరు పెరిగింది. బుధవారం రోజంతా కురిసిన వార్షంతోపాటు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చి చేరిన వర్షం నీడితో గెడ్డపై నున్న రోడ్డు పైనుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ ఉన్న తంపర పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి వెద విత్తనాలు వేసుకున్న నెల రోజులకే తంపర పొలాల్లో నీరు చేరి పంటలు నీట మునిగాయన్నారు. దబ్బపాడు, తురకపేట, సుమంతాపురం, వాడవలస, చిట్టిమండలం, ధనుకువాడ, కోవిలాం తదితర గ్రామాలకు చెందిన వందలాది ఎకరాలు నీట మునిగాయని రైతులు తెలిపారు.



ఎల్.ఎన్.పేట: తురకపేట వద్ద కడపలవాని గెడ్డపై ప్రవహిస్తున్న వరదనీరు



నరసన్నపేట: బజారు వీధిలో చేరిన వర్షం నీరు



నరసన్నపేట: నరసన్నపేటలో కురుస్తున్న వర్షం

అధికారులు అప్రమత్తం..

పోలాకి: మండలంలోని బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. చెరువులు, కాలువలు నిండిపోవడంతో లోతట్టు పంట పొలాలను ముంచేశాయి. రోడ్లపై వాహనాలు సైతం తిరగలేనంతగా గాలులుతో కూడిన వర్షం కురిసింది. మోగివిల్లిపేట వద్ద కాలువ రోడ్డుపై నుండి వరద నీరు ప్రవహించటంతో డోల-పోలాకి-నౌపడ(డీపీఎస్) రహదారిపై పూర్తిగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. డీఎల్‌పురం, కొత్తరేవు, అంపలాం రెవెన్యూ పరిధిలో ఆక్వా చెరువులకు వెళ్లేందుకు దారులన్నీ మూసుకుపోవటంతో రైతులు ఇబ్బందిపడ్డారు. ముందస్తు వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లలేదని తహసీల్దార్ శ్రీరాములు తెలిపారు. పూరిళ్లు, పాత మట్టి ఇళ్లల్లో ఉన్నవారిని వెంటనే ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు.

శివారు ఆయకట్టుకు సాగునీరు

- ఓని గెడ్డ రిజర్వాయర్ కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభం



వెలగవాడ వద్ద ఓనిగెడ్డ రిజర్వాయర్ కాలువ పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: మండలంలో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరరావు అన్నారు. ఓని గెడ్డ రిజర్వాయర్ కాలువ ఆధునికీకరణ పనులు బుధవారం మన్యం జిల్లా పాలకొండ మండలం వెలగవాడ వద్ద (రిజ్వాయర్ హెడ్ నుంచి) ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని, ప్రస్తుత ఖరీఫ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఓని గెడ్డ రిజర్వాయర్ పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని, దీనికి స్పీకర్ తమ్మినేని సీతారాం కృషి ఎంతో ఉందన్నారు. రైతులకు అండగా ఈ ప్రభుత్వం ఉంటుందన్నారు. ఉభయ జిల్లాల కలెక్టర్ల ఆమోదంతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పూడికలు తొలగించి, కాలువల ఆధునీకరణ పనులు త్వరగా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్, మండల సచివాలయ కమిటీ కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పార్టీ నాయకులు వి.కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కలమట సాగర్‌వి అర్థంలేని ఆరోపణలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తనయుడు సాగర్‌వి అర్థంలేని ఆరోపణలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. వంశధార అతిథిగృహం వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడారు. జగనన్న కాలనీ లేఅవుట్‌లలో మట్టివేసి ఎత్తు చేసేందుకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సుమారు రూ.2.75 కోట్ల ప్రతిపాదనలు పంపారన్నారు. మేజర్ పంచాయతీ హిరమండలంలో 245 ఇళ్లు మంజూరు కాగా.. అందులో ఇప్పటికే పలు ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులు ప్రారంభించారన్నారు. ఆ విషయాలు ఏమీ తెలుసుకోకుండా ఏదో ఒకటి మాట్లాడటం సరికాదన్నారు. మీ తాత, నాన్న ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఉనికిని కాపాడుకోవడం కోసం ఎలాబడితే అలా మాట్లాడటం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వి.చిన్నారావు, వి.బాలరాజు, యందవ ప్రసాద్, ఎం.శంకర్, నక్క ఆనందరావు, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



జ్వరాలపై ఆరా తీస్తున్న హెల్త్ సిబ్బంది

బూర్జ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్ వైజర్లు లఖినాన సరోజిని, తేజారావు అన్నారు. మండలంలోని మదనాపురం గ్రామంలో బుధవారం బూర్జ పీహెచ్‌సీ వైద్యులు ఐ.పావని, జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వేలో భాగంగా జ్వరబాధితులను గుర్తించారు. డెంగీ ఫీవర్‌తో బాధపడుతున్న వావిలపల్లి పాపమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆమెకు పలు సూచనలు అందజేశారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ ప్రజలు అధైర్యపడాల్సిన పనిలేదని, ముందస్తు జాగ్రత్తలు చర్యలు పాటిస్తే అంటురోగాలు దరిచేరవన్నారు. గ్రామంలోని బావుల్లో, మురుగు నీరు నిల్వ ఉన్నచోట క్లోరినేషన్ చేయించారు. ఎంఎల్‌హెచ్‌పి పి.శ్రావ్య, హెల్త్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓపై ఫిర్యాదు

కొత్తూరు: కొత్తూరు ఎంపీడీఓ ఎం.పావనిపై జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓలకు ఫిర్యాదు చేసినట్లు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్.రమేష్ తెలిపారు. కొత్తూరు గ్రామ సచివాలయం -2లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాల్సి ఉన్నా.. కేవలం గంట సమయం మాత్రమే నిర్వహించి ముగించారన్నారు. సాయంత్రం రెండున్నర గంటలకు వెళ్లే సరికి అక్కడ అధికారులు ఎవరూ లేవన్నారు.

12 గంటలకు కార్యక్రమం పూర్తయింది..

ఫిర్యాదు విషయాన్ని ఎంపీడీఓ వద్ద ప్రస్తావించగా.. కొత్తూరు గ్రామ సచివాలయం-2లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు పూర్తయిందన్నారు. 110 మందికి పలు రకాల ధ్రువపత్రాలు అందజేశామన్నారు. వర్షం కారణంగా కార్యక్రమాన్ని వేగంగా ముగించామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్.ఎన్.పేట: మండలంలో ఖాళీగా ఉన్న బొత్తాడసింగి అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టుకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు కొత్తూరు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ యు.విమలకుమారి బుధవారం ప్రకటించారు. బొత్తాడసింగి ఆయా పోస్టుకు ఓసీ (ఈడబ్ల్యూఎస్) కేటగిరికి చెందిన మహిళలు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కొత్తూరు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న స్థానిక వివాహితులైనవారు, 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు.

కొత్తూరు: కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఈ నెల 31 తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక సీడీపీఓ విమలకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు మండలంలోని మాకవరం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు, నేరడి(ఎస్) వర్కర్ పోస్టు ఎస్టీలకు కేటాయించామన్నారు. నీలకంఠాపురం హెల్పర్ పోస్టు బీసీ- ఈకి కేటాయించినట్లు తెలిపారు. హిరమండలం మండలం పరిధిలోని గేసరిగూడ మినీ కేంద్రంలో వర్కర్ పోస్టు బీసీ-డీకి కేటాయించినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఫోన్ 95022 71968 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నష్టపరిహారం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పొందూరు: మడ్డువలస కాలువ తవ్వకాల్లో కోల్పోయిన తమ భూములకు నష్టపరిహారాన్ని త్వరగా అందించాలని కొందరు రైతులు, పెంచాలని మరి కొందరు రైతులు అధికారులను కోరారు. నర్సాపురం గ్రామంలో రెవెన్యూ, మడ్డువలస, భూసేకరణ అధికారులు నర్సాపురం, వీఆర్‌గూడెం, వావిలపల్లిపేట రైతులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. తమకు ఇచ్చిన నష్టపరిహారం చాలా తక్కువని, పరిహారాన్ని పెంచాలని నర్సాపురం రైతులు కోరారు. నష్టపరిహారాన్ని ఒకసారి అందించిన తర్వాత మరలా పెంచడం సాధ్యం కాదని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, మడ్డువలస డీఈ నాగేశ్వరరావు చెప్పారు. వీఆర్‌గూడెంలో 15 మంది రైతులకు, వావిలపల్లిపేట గ్రామంలో ఐదుగురు రైతులకు పరిహారం అందించిన తర్వాతే పనులు ప్రారంభించాలని రైతులు స్పష్టం చేశారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.

ఇంటర్ విద్య కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ రామచంద్రరావు

ఆమదాలవలస: ప్రతీ విద్యార్థికి జీవితంలో ఇంటర్‌మీడియెట్ కీలకమని ఆమదాలవలస ఎంఈఓ జి.రామచంద్రరావు అన్నారు. స్థానిక ఎస్‌ఎస్‌ఎన్ కల్యాణ మండపంలో టీఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భవిష్యత్‌లో మంచి మార్గాన్ని ఎన్నుకోవడానికి ఇంటర్ విద్య కీలకమన్నారు. విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.కాంతారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చక్రధరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

కొత్తూరు: వరి సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని స్థానిక ఏఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి రైతు భరోసా కేంద్రంలో గిరిజన రైతులతో వైఎస్సార్ పొలంబడిని బుధవారం నిర్వహించారు. 30 మంది రైతులను ఐదు గ్రూపులుగా విభజించారు. వరి సాగులో మెలకువలతోపాటు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఎలా సాధించాలో అవగాహన కల్పించారు. 16 వారాలపాటు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే వరి సాగులో పెట్టుబడి తగ్గుతుందన్నారు. ప్రభుత్వం గిరిజన రైతులకు అందిస్తున్న పలు పథకాలను వివరించారు. వంద శాతం రాయితీపై గిరిజన రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. గొట్టిపల్లి వ్యవసాయ సహాయకురాలు శ్రీలక్ష్మి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. జనానికి రక్ష

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పోలాకి: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అనేక సేవలు ఉచితంగా అందజేస్తున్నామని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గుప్పెడుపేట సచివాలయం పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వీలైనంత తొందరగా పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాల్లో వర్షాకాలంలో విషజ్వరాల వ్యాప్తి నిర్మూలనకు వైద్యశాఖ అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వాలు చేసినట్లు ఎక్కడో ఒకటో, రెండో కార్యక్రమాలు చేసి గొప్పగా చెప్పుకోవటం కాకుండా.. ప్రతి గ్రామంలోనూ అక్కడి ప్రజలకు అవసరమైన పనులు చేపట్టి ప్రాధాన్యతాక్రమంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కణితి సత్తిబాబు, తులే పైడమ్మ, నందుపల్లి పైడితాత, రెంటికోట త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. దేశానికే ఆదర్శం..

కొత్తూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న జనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, కురిగాం సర్పంచ్ అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయం-2, కురిగాం గ్రామ సచివాలయాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా నిర్వహించలేదన్నారు. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడిందన్నారు. లబ్ధిదారులకు ధ్రవపత్రాలను అందజేశారు. తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ పావని, ఈఓపీఆర్డీ కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యానారాయణ, ఎంపీటీసీ గండివలస రత్నకుమారి, ఉపసర్పంచ్ జడ్డు మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, లోతుగెడ్డ తిరుపతిరావు, పంకజదాస్, రాజులు నాయుడు, గండివలస ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: కొత్తూరులో ధ్రవపత్రాలు అందజేస్తున్న అధికారులు, సర్పంచ్ పడాల కృష్ణవేణి

జగనన్న సురక్ష విజయవంతం

- ప్రయోజనం పొందిన వారు 5821 మంది
- రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు 5924 మంది
- ఉచితంగా ప్రభుత్వ సేవలు

నరసన్నపేట: ప్రజలకు మేలు చేయాలనే తపన.. ఆకాంక్ష ఉంటే మంచి చేయవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపిస్తున్నారు. దీంట్లో భాగంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం నరసన్నపేట మండలంలో విజయవంతమైంది. జులై 1న జమ్ము, తామరాపల్లిలో ప్రారంభించిన జగనన్న సురక్ష సభలు చివరగా మంగళవారం కామేశ్వరిపేట, లుకలాం గ్రామాల్లో నిర్వహించారు. మొత్తం 24 సచివాలయాల్లో పండగ వాతావరణంలో సభలు జరిగాయి. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, పోలాకి జెడ్పీటీసీ, పార్టీ బీసీ సెల్ జోనల్ కన్వీనర్ ధర్మాన కృష్ణచైతన్యలు సభలకు హాజరై ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, సచివాలయ కన్వీనర్ సురంగి నర్సింగరావులు సభలకు వెళ్లి ప్రజలతో మమేకయ్యారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు బాధ్యత ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తహసీల్దార్ ఎ.సింహాచలం, ఎంపీడీఓ బి.మధుసూదనరావులు రెండు టీంలకు నాయకత్వం వహించి, ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సభలు నిర్వహించారు. మండలంలోని 24 సచివాలయాల్లో 5,924 మంది వలంటీర్ యాప్‌లో ప్రయోజనం కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోగా.. 5821 మందికి ప్రయోజనం కలిగింది. దీంట్లో 5221 మందికి వివిధ సర్టిఫికేట్స్ పంపిణీ చేయగా.. ఆధార్ సేవలు మరో 600 మందికి అందించారు. దీంతో ప్రయోజనం పొందినవారు ఆనందించారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్దకే సర్టిఫికెట్లు ఇచ్చారని, ఆధార్ లింక్ సేవలు అందించారని లబ్ధిపొందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ భాషతో బహుళ ప్రయోజనాలు

సరుబుజ్జిలి: పాఠశాల స్థాయిలో ద్వితీయ భాషగా ఉన్న రాజభాష హిందీ నేర్చుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని సరుబుజ్జిలి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బొత్స వెంకటరమణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ సబ్జెక్ట్ టీచర్లకు సంబంధించి పాఠశాల కాంప్లెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. విద్యార్థుల్లో హిందీ భాషా నైపుణ్యాలు మెరుగుపరచే దిశగా అధ్యాపకులు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ బెండి చిన్నారావు, పలు పాఠశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో గల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జడ్జి ఎస్.మణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయ శాస్త్రం చదివిన విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అర్హులన్నారు. నియామకం చేసిన వలంటీర్‌లకు ఎటువంటి పారితోషకం ఉండదన్నారు. గుర్తింపు కార్డు ఇస్తామన్నారు.

తాడివలసలో ఓటర్ జాబితా సర్వే



సర్వే చేస్తున్న బీఎల్‌ఓ

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామంలో ఇంటింటా ఓటర్ జాబితా సర్వే బుధవారం ప్రారంభమైంది. వాస్తవానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి సర్వే తప్పనిసరిగా ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. సాంకేతిక కారణాలతో ఐదు రోజులు బీఎల్‌ఓలు సర్వే నిర్వహించలేదు. తహసీల్దార్ పి.వేణుగోపాలరావుకు ఈ విషయం తెలియడంతో సమస్యను పరిష్కరించి సర్వే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎంపీడీఓ ఆగ్రహం



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

పొందూరు: నందివాడ సచివాలయం సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరుకావడంతో ఎంపీడీఓ సీపాన హరిహరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బంది 10:30 గంటల వరకు రాలేదని.. బుధవారం ఆ గ్రామస్తులు 10.45 నిమిషాలకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ 11 గంటలకు సచిలయానికి వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి మోహన్ తప్ప.. మిగిలిన సిబ్బంది కార్యాలయానికి రాలేదు. 11.10 నిమిషాల తర్వాత ఒక్కొక్కరు హాజరుకావడంతో ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోసారి ఆకస్మిక తనిఖీ చేస్తానని, ఇలాగే జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానని, ఉన్నతాకారులకు తెలియజేస్తానని హెచ్చరించారు.